క్లుప్తంగా

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మూడు కంపెనీలు పాల్గొనగా 110 మంది అభ్యర్థులు హాజరవగా ఆయా కంపెనీల ప్రతినిధులు 32 మందిని ఎంపిక చేసుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ జిల్లా అధికారులు సుబ్బన్న, హరిత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత, ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్ఈఈడీఏపీ, ఎంప్లాయిమెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి



అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పగిడ్యాల: ఆసుపత్రి అభివృద్ధికి మంజూరైన నిధులను దుర్వినియోగం చేయకుండా ఆసుపత్రి అభివృద్ధికి వెచ్చించాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి సూచించారు. శుక్రవారం తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఏటా ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు ఖర్చు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ఇటీవల రూ.80 వేలు మంజూరయ్యాని డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ శేషమ్మ పాల్గొన్నారు.

తంగడంచలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

జూపాడుబంగ్లా: నిరుపయోగంగా ఉన్న తంగడంచ ఫారం భూముల్లో కృషివిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు కలెక్టర్ రాజకుమారిని కోరారు. శుక్రవారం ఫారం భూముల పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు రమేష్ వినతిపత్రాన్ని అందజేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

నందికొట్కూరు: జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడలలో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సెయింట్ మేరీస్ హైస్కూల్ చైర్మన్ నిర్మల, కరస్పాండెంట్ కెన్నెడి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ బాలుర విభాగంలో జూడో అండర్-17 జాతీయస్థాయి పోటీలకు ఎం. చైతన్య గౌడ్, కబడ్డీ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎ. జామ్యూయేలు ఎంపికయ్యారని శుక్రవారం తెలిపారు. ఈ నెల 24న నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. పాఠశాల నుంచి జామ్యుయేలు ఎంపికయ్యాడని ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయి జూడో పోటీలు తిరుపతిలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించగా చైతన్యగౌడ్ ప్రతిభ చూపాడని దీంతో.. జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయ జూడో పోటీలకు ఎంపికయ్యాడని, వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో జరిగే పోటీల్లో పాలొంటాడని వివరించారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

మహానంది: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆలయాల్లో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు టీటీడీ ఏఈ లక్ష్మీపతి తెలిపారు. మహానందిలో జరుగుతున్న టీటీడీ వసతి గృహాల నిర్మాణం పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పురాతన, ప్రాచీన ఆలయాల వద్ద ఉన్న రాజగోపురాల పునర్నిర్మాణం, వసతి గృహాల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మహానందిలో జరిగే పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం

బండిఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఏ.కోడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ విధానాలపై, మహిళలపై అత్యాచారాల పై, అధిక ధరలపై విశాఖ ఉక్కు ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా, నిరుద్యోగ సమస్యలపై నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు రామచంద్రుడు, సభ్యులు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రబీపైనే రైతన్నల ఆశలు

ఖరీఫ్ సీజన్‌లో నష్టాలను మూటగట్టుకున్న అన్నదాతలు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రబీకి సిద్ధమయ్యారు. మినుములు, మొక్కజొన్న సాగుకు పొలాలను రూపు చేసుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. ఖరీఫ్‌లో అరకొరగా పండిన ధాన్య విక్రయించినా అప్పులు సైతం మిగిలినప్పటికీ అన్నదాతలు అధైర్యపడకుండా రబీ సీజన్‌కు సన్నద్ధమవుతన్నారు. నాగళ్లు, ట్రాక్టర్లతో పొలాలను దున్నుకుంటున్నారు. – ఆత్మకూరు

- నట్టేట ముంచిన ఖరీఫ్
- మినుము, మొక్కజొన్న పంటల వైపే అన్నదాత మొగ్గు



ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు(ఫైల్)



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

ఈ యేడాది ఖరీఫ్‌కు వీడ్కోలు పలికిన రైతులు రబీ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఆత్మకూరు డివిజన్‌లో ఇప్పటి వరకు రబీ సీజన్‌లో మొక్కజొన్నను ఎక్కువగా సాగుచేసేవారు. ఈ యేడాది మొక్కజొన్న పంటను తగ్గించి మినుముపై ఆసక్తి చూపుతున్నారు. ఆత్మకూరు మండలంలో సాధారణంగా 3,207 హెక్టార్లలో పంటలను సాగుచేయాల్సి ఉండగా.. ఇప్పటికే దాదాపు 4 వేల హెక్టార్లకు పైగా రైతులు పంటలను సాగుచేశారు. మరో 2 వేల నుంచి 3 వేల ఎకరాల్లో మినుము సాగుచేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రబీలో మొక్కజొన్న సాధారణ సాగు 500 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 200 హెక్టార్లకు మించలేదు. డివిజన్ వ్యాప్తంగా 8,670 హెక్టార్లలో మినుము, 1,834 హెక్టార్లలో మొక్కజొన్న సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు 200 హెక్టార్లలో కంది, 300 హెక్టార్లలో జొన్న సాగుచేసేందుకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు.

పొలం పనుల్లో బిజీ అయిన రైతన్నలు

రబీకి సిద్ధమైన రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. మొక్కజొన్న పంటను కోత కోసం మిగిలిన పొలాల్లో మినుము, మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగుచేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలుచోట్ల విత్తు వేస్తుండగా మరికొంత మంది పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో మినుము పంటను సాగుచేస్తున్నారు.

ఖరీఫ్‌లో తీవ్ర నష్టం

ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో ఎన్నడూలేనివిధంగా ఆత్మకూరు డివిజన్‌లో వర్షాలు కురవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వేలాది హెక్టార్లలో సాగుచేసిన మొక్కజొన్న, మినుము పంటలు వర్షార్పణమయ్యాయి. మిర్చి, పత్తి లాంటి భారీ పెట్టుబడులు పెట్టే పంటలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దాదాపు రూ.3 కోట్ల నుంచ రూ.4 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

నవంబర్ వరకు అదును ఉంది



ఈ యేడాది రబీ సీజన్‌కు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే వందలాది ఎకరాల్లో రైతులు మినుము సాగుచేశారు. నవంబర్ చివరి వరకు అదును ఉంది. రైతులకు మినుము పంటను కూడా ఈ యేడాది సబ్సిడీలో అందించేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రబీలో మినుము, మొక్కజొన్న, వేరుశనగ, కంది పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంది.
– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

ఖరీఫ్‌లో నష్టపోయాం



మే మొదట్లో పంటలను సాగుచేశాం. భారీ వర్షాలకు మొక్కజొన్న, మినుము పంటలు దెబ్బతిన్నాయి. మరోసారి విత్తు వేసినా పంటలు చేతికొచ్చేదశలో వర్షార్పణమయ్యాయి. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా నష్టపోయాం. ఇప్పుడిప్పుడే కొంత తేరుకుని రబీలో పంటలు వేసేందుకు సిద్ధమయ్యాం.
– పింజరి మౌలాలి, రైతు, కరివేన గ్రామం

మినుము పంటపైనే ఆశలు



ఖరీఫ్ సీజన్ పోయి రబీ సీజన్ వచ్చింది. బోరుబావులు, చెరువుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. ఖరీఫ్‌లో పంటలు దెబ్బతినడంతో రబీ సీజన్‌పైనే ఆశలు పెట్టుకున్నాం. ప్రస్తుతం మినుము పంటను సాగుచేస్తున్నా. పంట బాగా పండితే నా కష్టం తీరే అవకాశం ఉంది.
– నజీముద్దీన్, ఆత్మకూరు రైతు

నకిలీ మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

నందికొట్కూరు: నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి వై. వీ మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ పాయింట్లను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల డీలర్ల రిజిష్టర్లలో బస్తాల ప్రకారం కాకుండా మెట్రిక్ టన్నుల్లో పొందపరచాలని సూచించారు. బిల్లులను ఫారం ఎం ప్రొఫార్మల్లో ఉన్న విధంగా చేయాలని తెలిపారు. కంపెనీలకు సంబంధించిన ఎరువుల స్టాకును వేర్వేరుగా ఉంచాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏడీఏ విజయశేఖర్, మండల అధికారులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

జూపాడుబంగ్లా: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జి.ధనలక్ష్మి, రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవిగౌడు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని తర్తూరు గ్రామంలో రైతులకు పత్తి పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి పంటను సాగు చేయటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఏడీఏ విజయశేఖర్, జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి, షేక్షావలి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ



తహసీల్దార్‌కు దరఖాస్తు అందజేస్తున్న రైతు

పాములపాడు: రైతులు ఎదుర్కొంటున్న పొలాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికే గ్రామ సభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 5 అర్జీలు వచ్చాయి. రీ సర్వేలో పొలాలు విస్తీర్ణంలో తేడాలున్నాయని రైతులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు.సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామని రైతులకు వివరించారు. సర్పంచు వరప్రసాద్, రీ సర్వే డీటీ సుప్రియ, మండల సర్వేయర్ భాస్కర్, కలీముల్లా, వీఆర్వో ఉసేన్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వేలో భాగంగా రైతులు ఇచ్చిన రికార్డుల్లో జరిగిన తప్పొప్పులను సరిచేయించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ భూసర్వే అనంతరం తమకు ఇచ్చిన జాయింట్ ఎల్పీఎం ల నెంబర్లను సరిచేసి వ్యక్తిగతంగా ఎల్పీఎం నెంబర్లు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో జరిగిన పొరపాట్లను నవంబర్ నెలాఖరులోగా సరిచేసి రైతులకు పటిష్టమైన వివరాలతో కూడిన వన్‌బీ, అడంగల్ అందేలా చూస్తామని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన 71 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. డీటీ నాగన్న, మండల సర్వేయర్ షాద్‌మాన్ అతీఫ్, వీఆర్వో శ్రీనివాసులునాయుడు, రైతులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న బండిఆత్మకూరు తహసీల్దార్

ఆత్మకూరు: రీ–సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. శుక్రవారం పిన్నాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

- వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో 182 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ తెలిపారు. నవంబర్ 30వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, మండల సర్వేయర్ ఉపేంద్ర ల్గొన్నారు.
- బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు 89 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. మ్యుటేషన్‌కు 8, జాయింట్ ఎల్‌పీఎంకు 55, విస్తీర్ణం మార్పుకు 21, సవరణకు 5 చొప్పున దరఖాస్తులు అందాయన్నారు.

క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి

ఆత్మకూరు: క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తామని క్రీడా భారతి డివిజన్ అధ్యక్షులు, ప్రైవేట్ విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి అన్నారు. జగద్గురు మఠంలో శుక్రవారం క్రీడా భారతి ద్వారా క్రీడల నైపుణ్యత అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్.సుధాకర్ పాల్గొన్నారు. సమావేశంలో ఆత్మకూరు తాలూకా ప్రెసిడెంట్ గుణంపల్లి పురుషోత్తంరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్రీడా భారతి డివిజన్ అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి మాట్లాడుతూ యువతీ, యువకులు క్రీడల్లో రాణించి దేశ ప్రతిష్టను పెంపొందించాలన్నారు.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

మిడుతూరు: గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మిడుతూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మండలంలో సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచాలని సిబ్బందికి సూచించారు. పేకాట, నాటు సారా, తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. మైనర్ బాలురకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. పీర్‌సాహెబ్ పేట గ్రామంలో తచూ అల్లర్లకు పాల్పడుతున్నారని అలాంటి వారిని గుర్తించి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసు ఉన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

నందికొట్కూరు: మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు చెప్పారు. శుక్రవారం మండలంలోని అల్లూరు గ్రామంలో పర్యటించి నడిబొడ్డున గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

సాగునీటి సంఘాల ఓటరు జాబితాపై అవగాహన

బండిఆత్మకూరు: సాగునీటి సంఘాల ఓటరు జాబితాపై వీఆర్వోలకు, విలేజ్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథం మాట్లాడుతూ గ్రామాల్లోని రెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు, అభివృద్ధి పనులు పెండింగ్ పడకుండా త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఓటరు జాబితాను రూపొందించాలన్నారు.

పరామర్శ

బండిఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్త బీసీ వెంకటేశ్వర్లును శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి పరామర్శించారు. వెంకటేశ్వర్లు సతీమణి తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణి రెడ్డి బండిఆత్మకూరుకు చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ముడిమేల పుల్లారెడ్డి ఉన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించండి

పగిడ్యాల: 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 8 గ్రామ పంచాయతీల్లో జరిగిన 671 పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు వచ్చిన తనిఖీ బృందానికి ఉపాధి కూలీలు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఈసీ సహకరించాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కింద మండలంలో రూ.7.31 కోట్ల పనులు చేసినట్లు వెల్లడించారు. వేతనాలకు రూ.4.98 కోట్లు, మెటీరియల్ ఖర్చులకు రూ.33 లక్షలు, పంచాయతీరాజ్ కింద 20 పనులు చేయగా మెటీరియల్ రూపంలో రూ.2 కోట్లు, వేతనాల రూపంలో రూ.4,896 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందం భౌతికంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తారని స్థానిక సిబ్బంది సహకరించాలని చెప్పారు.ఎస్ఆర్‌పీ మురాద్, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

విజయంతం చేయండి

పగిడ్యాల: స్వయం సహాయక పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాలు నేర్పేందుకు చేపట్టిన వయోజన విద్య కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం కళావతి అధ్యక్షతన నిర్వహించిన వీబీకేల సమావేశానికి హాజరై మాట్లాడుతూ ప్రతి మహిళ చదువుకోవాలని సూచించారు. అక్షరాలు నేర్చుకోవడానికి వయస్సుతో సంబంధం లేదని ఇంటి వద్దనే ఉండి అక్షరాలు నేర్చుకుని పలువురికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. మండలానికి 750 మంది మహిళలకు చదువు నేర్పించాలని లక్ష్యం నిర్దేశించారని దానిని సకాలంలో పూర్తి చేయాలని వీబీకేలను ఆదేశించారు.

ఆర్టీసీ బస్టాండులో పోలీస్ నిఘా



ఆర్టీసీ బస్టాండులో గస్తీ నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్

సాక్షి ఎఫెక్ట్

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో విద్యార్థులు, ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందంటూ సాక్షి ప్రచురించిన కథనానికి పోలీసులు స్పందించారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో కానిస్టేబుల్ నియమించి గస్తీ నిర్వహించారు. ఇకపై ఆకతాయిల చేష్టలతో పడుతున్న ఇబ్బందులు తొలగుతాయని పలువురు విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



పశుగణన పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏడీ రామాంజనేయ నాయక్

నందికొట్కూరు: పశుగణనకు రైతులందరూ సహకరించాలని పశువైద్యాధికారి వరప్రసాద్ కోరారు. శుక్రవారం పట్టణంలోని కోట వీధిలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం పోస్టర్‌ను డాక్టరు, రైతులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

పాములపాడు: పశుగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు రైతులు పూర్తి వివరాలను ఇవ్వాలని పశువైద్యాధికారులు భాస్కర్, అనిల్ కోరారు. శుక్రవారం మండలంలోని పాములపాడులో సర్పంచు మేకల భాగ్యమ్మ, వేంపెంట గ్రామంలో సర్పంచు మాణిక్యమ్మ, తుమ్మలూరులో సర్పంచు వరప్రసాద్ 2024 అఖిల భారత పశుగణను పోస్టర్‌ను విడుదల చేశారు.

జూపాడుబంగ్లా: పశుగణనకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయ నాయక్ కోరారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ మొట్టిబాలయ్య, ఎంపీటీసీ మోతెవెంకటమ్మ చేతుల మీదుగా పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ పశుగణన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి పశువులు, కోళ్లు, కుక్కలు, గొర్రెలు, మేకలు, తదితర పశువులు, జంతువుల వివరాలను నమోదు చేసుకుంటారని చెప్పారు. వారికి ప్రజలు పూర్తిస్థాయి సమచారం అందజేయాలని చెప్పారు. జంగాలపెద్దన్న, బాబు, పశువైద్యసిబ్బంది నవీన్‌కుమార్, సుధీర్, సుమన్, హేమకుమార్ పాల్గొన్నారు.

వెలుగోడు: పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మండల పశు వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి సిబ్బందికి సూచించారు. వెలుగోడు పట్టణంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి పశువులు, జీవాలు, కోళ్లు, పెంపుడు జంతువుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు జరిగే పశు గణనకు పాడి రైతులు సహకరించాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

మహానంది: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ ఎఫ్‌డీపీటీ బీవీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. అటవీశాఖ సిబ్బంది విధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ నూతనంగా తీసుకొచ్చిన ఎమ్ స్ట్రైప్స్ యాప్‌పై జిల్లాలోని అన్ని రేంజ్‌లలో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌ఓలు, ఎఫ్ఎస్ఓలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అడవుల్లో చేపట్టే విధుల సమయంలో ఎలాంటి ప్రాధాన్యత అంశాలు గుర్తించినా, ప్రత్యేకతలు కనిపించినా వెంటనే ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరచాలన్నారు. పులుల సంరక్షణ, పులుల గణనలో ఎన్ఎస్‌టీఆర్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పులుల సంగమం సమయంలో అడవుల్లోకి ఎవరికీ ఎలాంటి అనుమతి ఉండదని, ఎవరైనా అడవిలోకి వెళితే కఠినచర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, ఏసీఎఫ్ ధనరాజ్, హైటికాస్ ప్రతినిధి దూపాడు శ్రీధర్, నంద్యాల, రుద్రవరం, చలమ రేంజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పనిముట్లు, వాహనాల రిపేరీ, చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ చెల్లించాలన్నారు. పనికి తగ్గ వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన నాయకులు నాగన్న, గొడుగు రాజు, పెద్ద నాగరాజు, తిమ్మయ్య పాల్గొన్నారు.

గుంతకందాలలో 'పొలంబడి'

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామ పరిధిలోని వరి పొలంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ పవన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించాలన్నారు. డ్రోన్ల వినియోగంతో కూలీల సమస్యను అధిగమించడమే కాకుండా, పురుగుమందులపై పెట్టే ఖర్చు 40 శాతం వరకు ఆదా అవుతుందన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: స్థానిక కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, ఆంజనేయశర్మ, అర్చకులు శరభయ్యశర్మ వైభవంగా నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.